AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com

25-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## అదనపు కలెక్టర్‌తో మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుల భేటీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా నూతన మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో శనివారం ఆయన ఛాంబర్‌లో భేటీ అయ్యారు. జిల్లా డీఎంఏసీ సభ్యులను పరిచయం చేసుకుని, వారికి సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవోకు అనుగుణంగా అర్హులైన వారికి అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ విషయంలో కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పారదర్శకంగా ఈ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. త్వరలోనే కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మీడియా కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు.



# రిజిస్ట్రేషన్ల శాఖలో సిబ్బంది తప్పిదం..

## గందరగోళంగా మ్యుటేషన్లు

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని రిజిస్ట్రేషన్ల కార్యాలయాలపై పర్యవేక్షణ కొరవడింది. డీఐజీ, డీఆర్ ఇన్‌ఛార్జీలే ఉండడంతో పూర్తిగా పాలన గాడి తప్పింది. దీంతో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దొడ్డిదారిలో రిజిస్ట్రేషన్లు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. - అక్షరటుడే, నిజామాబాద్**

ఇటీవల నిజామాబాద్ అర్బన్ కార్యాలయం పరిధిలో జరిగిన ఓ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై ఏకంగా క్రిమినల్ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఓ ఇంటి యజమాని బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధృవపత్రాలు సృష్టించి మరొకరి పేరిట బదిలీ చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఒకటో టౌన్ పోలీసులు పలువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. ఇందులో డాక్యుమెంట్ రైటర్ పాత్ర కీలకంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు తప్పుడు ప్రతాలు అని తెలిసినా అప్పటి సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది.

### అడగోలుగా మ్యుటేషన్లు

నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వారం కిందట మరో తప్పిదం జరిగిన విషయం తాజాగా బయటపడింది. ఈ నెల 17, 18 తేదీల్లో సుమారు 70 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. కాగా.. వీటికి సంబంధించిన మ్యుటేషన్ ప్రక్రియలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇది కాస్తా.. దరఖాస్తుదారుల పాలిట శాపంగా మారింది.

వాస్తవానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సమయంలోనే మ్యుటేషన్‌కు సంబంధించిన రుసుము రూ. 3వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. తదనంతరం అమ్మిన వారి నుంచి కొన్న వారి పేరిట ఆస్తి తాలుకా మ్యుటేషన్ ప్రక్రియను అంతా ఆన్‌లైన్‌లో పూర్తి చేసి సంబంధిత మున్సిపల్ లాగిన్ రిఫర్ చేస్తారు. తదుపరిగా అక్కడి అధికారులు పున:పరిశీలన చేసి ఒకటిరెండు రోజుల్లో మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. కానీ 17, 18 తేదీల్లో జరిగిన పలు డాక్యుమెంట్లు మ్యూటేషన్ ప్రక్రియలో పెద్ద గందరగోళం జరిగినట్లు సమాచారం. రెసిడెన్షియల్ జోన్‌కు బదులుగా కమర్షియల్ జోన్‌లో ఉన్నట్లు ఐచ్ఛికం ఇవ్వడంతో దాదాపు 70 వరకు దస్తావేజుల మ్యుటేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో బాధితులు తమ పరిస్థితి ఏమిటని – మిగతా 2వ పేజీలో..

### కవిత నేపథ్యం

కవిత కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్, విదేశాల్లో మాస్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేశారు. అమెరికాలో కొంతకాలం ఉద్యోగం చేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణకు వచ్చి జాగృతి ద్వారా ప్రజా జీవితంలోకి వచ్చారు. అనంతరం ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారు. మాజీ ఎంపీగా, కేసీఆర్ కూతురుగా కవితకు జిల్లా రాజకీయాలను ఆమె గతంలో శాసించారు. ఈ క్రమంలో భారీగా అనుచరులను తయారు చేసుకున్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాడారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రయత్నాలు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, సాగునీటి ప్రాజెక్టుల పురోగతిలో కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి జిల్లాలోని ఆమె అనుచరులు కొత్త పార్టీలో చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు కవిత వెంట వెళ్లారు.



**జిల్లా కోడలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ తన పార్టీకి టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) అని పేరు పెట్టారు. నిజామాబాద్ నుంచి తన రాజకీయ జీవితాన్ని ఆరంభించిన ఆమె బాటలో పలువురు జిల్లా నాయకులు పయనించే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా పని చేసిన క్రమంలో ఆమెకు ఇక్కడ భారీగా అనుచరులు ఉన్నారు. వారంతా కొత్త పార్టీలో చేరే అవకాశం ఉంది.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

# జిల్లా కోడలి కొత్త పార్టీ

■ తెలంగాణ రాష్ట్ర సేన ఏర్పాటు చేసిన కవిత ■ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం ■ ఉమ్మడి జిల్లాలో భారీగా కవిత అనుచరులు

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. ఉద్యమ కాలం నుంచి సంస్కృతి, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన కల్వకుంట్ల కవిత తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో సరికొత్త రాజకీయ పంథాను ఎంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సాక్షిగా ఈ నూతన పార్టీ ఆవిర్భావం ప్రకటించిన ఆమె, ప్రజాక్షేత్రంలో సరికొత్త పోరాటానికి సిద్ధమయ్యారు.

### జిల్లా నుంచే మొదలు

కవిత కరీంనగర్ జిల్లాలో జన్మించారు. అయితే నవీపేట మండలం పోతంగల్ గ్రామానికి చెందిన దేవనపల్లి అనిల్ కుమార్‌ను పెళ్లి చేసుకున్నారు. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజా జీవితంలోకి వచ్చిన ఆమె.. తొలిసారి 2014లో నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో కవిత కీలకంగా వ్యవహరించారు. 2019 ఎంపీ ఎన్నికల్లో ఓటమి పాలు అయ్యారు. అనంతరం ఆమె 2020లో స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కవిత జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు తీసుకొచ్చారు. పసుపు బోర్డు కోసం పార్లమెంట్‌లో గళమెత్తారు.

నిజామాబాద్ నుంచి మొదలైన కవిత రాజకీయ జీవితం నేడు కొత్త పార్టీ ఏర్పాటు వరకు సాగింది. అయితే ఆమె పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తుందో చూడాలి.

### సవాళ్లను అధిగమించి..

ఢిల్లీ మద్యం కేసు వంటి రాజకీయ వివాదాలు, జైలు జీవి తం వంటి ఒడిదుడుకులను ఎదుర్కొన్న కవిత ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి వస్తున్నారు. "నా పోరా టం పదవుల కోసం కాదు, తెలంగాణ ఆత్మగౌరవం అభి వృద్ధి కోసం" అని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.





### జిల్లా నుంచే పోటీ!

కవిత ఉమ్మడి జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. ఆమె పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు నిజామాబాద్‌లోనే తొలిసారి ప్రకటన చేసిన విషయం తెలిసిందే. శ్రీరామ నవమి సందర్భంగా ఖిల్లా రామాలయంలో కల్యాణానికి హాజరైన ఆమె.. అదే రోజు కొత్త పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేశారు. దీంతో రానున్న రోజుల్లో జిల్లాపై తెలంగాణ రాష్ట్ర సేన ఫోకస్ చేసే అవకాశం ఉంది. అలాగే కవిత సైతం నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే తాను ఎక్కడి నుంచి పోటీ చేస్తానని ఆమె క్లారిటీ ఇవ్వలేదు.

## తెయూ పాలకమండలి సభ్యుడు రజనీకాంత్‌కు సన్మానం



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడిగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త రజనీకాంత్ ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం సన్మానించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, టీఎన్జీవో జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడు పెద్దోళ్ల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా రజనీకాంత్ నియమించడం సంతోషంగా ఉందన్నారు. విద్యావేత్తగా ఆయనకున్న అనుభవం యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, సుమన్, రంజిత్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ తహశీల్దార్‌గా కిరణ్ కుమార్

**భీమ్‌గల్, అక్షరటుడే:** భీమ్‌గల్ మండల నూతన తహశీల్దార్‌గా కిరణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రజలకు రెవెన్యూ సేవల ను మరింత చేరువ చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేష్, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## దొడ్డురకం ధాన్యం సేకరణలో ఇబ్బందుల్లేకుండా చూడాలి: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దొడ్డురకం ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఇందల్వాయి మండలం చంద్రాయణపల్లి, గన్నారంలలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం సేకరణ తీరుతెన్నుల గురించి తెలుసుకున్నారు. ధాన్యం అమ్మకం విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను ఆరా తీయగా.. ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులు వేచిచూడాల్సిన పరిస్థితి తలెత్తకూడదన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని తూకం జరిపించి, వెను వెంటనే నిర్దేశిత రైస్‌మిల్లులకు పంపించాలని అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా రవాణాపరమైన ఇబ్బందులు ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జాప్యం చేయడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ఆలస్యం జరిగితే, అకాల వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణ ప్రక్రియలో అలసత్వానికి తావు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. సన్నరకంతో పాటు దొడ్డు రకం ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని, దొడ్డు రకం సేకరణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ సూచించారు. రైతులు ఏ దశలోనూ ఇబ్బందులకు గురి కాకుండా చూడాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో షామియానాలు, తాగునీరు వంటి వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం సేకరణలో గన్నీ బ్యాగులు వంటి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. నిర్ణీత ప్రమాణాలకు లోబడి రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చేలా క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లయ్స్ డీఎం ప్రవీణ్, డీసీవో శ్రీనివాస్, డీఏవో వీరస్వామి, ఏఎస్‌వో అరవింద్ రెడ్డి, ఎంపీడీవో అనంత్ రావు తదితరులు ఉన్నారు.

## కానిస్టేబుల్ ప్రమోద్ పిల్లల విద్యాభ్యాసానికి టెర్మినల్ గ్రూప్ ఆర్థికసాయం

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో రౌడీషీటర్ రియాజ్ దాడిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి చేయూతనిచ్చేందుకు టెర్మినల్ గ్రూప్ ముందుకొచ్చింది. ప్రమోద్ పిల్లల విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి ప్రమోద్ తల్లికి, సతీమణికి చెక్కును అందజేశారు. టెర్మినల్ గ్రూప్ సీఎండీ ఎస్పీ రెడ్డి తండ్రి ఎస్ఎల్ఎన్ రెడ్డి బోధన్‌లో గతంలో డీఎస్పీగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుటుంబాన్ని ఆదుకోవాలని సూచించడంతో ఎస్పీ రెడ్డి స్పందించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ఇద్దరు పిల్లల ఫీజులకు సంబంధించిన మొత్తాన్ని చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో సీపీ సాయిచైతన్య పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించనున్న ప్రభుత్వం: బొబ్బిలి రామకృష్ణ

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించనుందని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. ఆర్టీసీ జేఏసీతో ప్రభుత్వం చర్చలు సఫలమైన సందర్భంగా శనివారం నగరంలోని డిపో-1కు వెళ్లిన ఆయన కార్మికులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో నిరంకుశత్వంగా వ్యవహరించి యూనియన్లను పూర్తిగా తొలగించారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం యూనియన్లను తిరిగి పునరుద్ధరిస్తుందని బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. అతి త్వరలో యూనియన్ ఎలక్షన్స్ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పీఆర్సీ 11శాతం పెంచడానికి అంగీకారం కుదిరిందని.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కూడా ప్రారంభం అయిందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఉద్యోగులను ఎలక్ట్రిక్ బస్సుల రాకతో ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం అనేది నిలిపేస్తున్నారని రామకృష్ణ తెలిపారు. ఆర్టీసీలో పెంచిన పనిభారం త్వరలోనే తగ్గుతుందని.. చట్టం ప్రకారం అందరూ ఉద్యోగుల్లాగే ఎనిమిది గంటల పని వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లలో 30 వరకు ఆమోదం తెలుపుతూ.. ఎవరికి ఇబ్బంది కలగకుండా



ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలియజేశా1రు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ల శాఖలో సిబ్బంది తప్పిదం..

**మొదటిపేజీ తరువాయి..** ప్రశ్నిస్తున్నారు.

**ప్రత్యేక దృష్టి సారించాలి**

రిజిస్ట్రేషన్లు అంటే రూ. కోట్ల ఆస్తుల తాలుకాతో కూడుకున్నది. అధికారులు, సిబ్బంది ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు, సిబ్బంది ఎవరికి నచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఎడిట్ ఇండెక్స్ ఆప్షన్ ఉన్నప్పటికీ ఇది డీఆర్ పరిధిలోని అంశం కావడంతో సదరు అధికారి సైతం ఇన్‌ఛార్జి కావడం వల్ల ఈ ప్రక్రియ కోసం బాధితులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరుకుంటున్నారు.



# పురపాలన పరుగులు పెట్టేనా..!

**ఆర్మూర్ బల్దియాను గాడిలో పెట్టే సమయం ఆసన్నమైంది. గాడితప్పిన పురపాలనను పరుగులు తీయించేందుకు కొత్తగా పాలకవర్గం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సైతం సమీక్ష నిర్వహించారు. శాఖలన్నీ వారివారి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దీంతో వివిధ విభాగాల ప్రక్షాళనపై ఎమ్మెల్యే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. – అక్షరటుడే, ఆర్మూర్**

- ఆర్మూర్ బల్దియాపై ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దృష్టి
- మున్సిపాలిటీ ప్రక్షాళనపై ఫోకస్ చేయాలని సూచన
- బల్దియా సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు
- చర్యలు తీసుకోవాలని సూచన

ఆర్మూర్‌లో 2008 మేజర్ పంచాయతీ నుంచి 3వ గ్రేడ్ మున్సిపాలిటీగా ఆవిష్కృతమైంది. ఆ తర్వాత 2018లో పెర్కిట్, మామిడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కాగా.. సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా 36 వార్డులతో ఆవిర్భవించింది. లక్ష జనాభా 20 వేల నివాస, వ్యాపార, వాణిజ్య, గృహాలు ఉన్నాయి. ఇటీవల ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి**

పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సీసీ, బీటీ రోడ్లతోపాటు డ్రెయినేజీలను త్వరితగతిన పూర్తి చేయాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు ఎక్కడికక్కడ నేటి సరఫరా అందించాలని ఎమ్మెల్యే పాలకవర్గానికి సూచించారు. కౌన్సిలర్, ఎమ్మెల్యే ఇలా ఎవరి ప్రమేయం లేకుండా మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని అదేవిధంగా మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై మున్సిపల్ అధికారులు పోలీసు శాఖను సమన్వయం చేసుకొని అరికట్టాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

**పన్ను వసూళ్లపై దృష్టి..**

ఆర్మూర్ మున్సిపల్ సొంత ఆదాయ వనరుల్లో ప్రధానమైన ఆస్తి పన్ను వసూళ్లపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం డిమాండ్, గత బకాయిలు కలుపుకొని వసూళ్లు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా ఐదు శాతం రాయితీతో చెల్లింపులకు ప్రోత్సహించేందుకు బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు రోజువారి లక్ష్యాన్ని నిర్దేశించారు. రూ.7.50 కోట్ల ఆస్తిపన్నుకు గాను ఇప్పటి వరకు రూ. 2 కోట్ల మేర వసూలు జరిగినట్లు సమాచారం. అధికారులు పాత బకాయిలతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. అయితే 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం మాత్రం మొక్కుబడిగా సాగుతోందని విమర్శలు వస్తున్నాయి.

**పడకేసిన పారిశుధ్యం...**

వార్డుల్లో పారిశుధ్య పనులు పడకేశాయి. ముఖ్యంగా కాల్వలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురికి కాలువలో మురికి నీరు పేరుకుపోతోంది. మరోవైపు కాలనీల్లోకి చెత్త సేకరించే వాహనాలు సరిగ్గా రాకపోవడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులకు అనుగుణంగా సరిపోయేలా వాహనాలు లేకపోవడం, ఉన్న వాహనాలు రిపేర్లతో మూలకు చేరాయి. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు శ్రద్ధ వహించి ఆర్మూర్ పట్టణ అభివృద్ధిని పరుగులు తీయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎల్లారెడ్డిలో ప్రపంచ మలేరియా డే అవగాహన ర్యాలీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రపంచ మలేరియా డేను పురస్కరించుకొని శనివారం ఎల్లారెడ్డి లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, మత్మల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. 'పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డివిజన్ ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పి నర్సింగ్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, మత్మల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శరత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఠాకూర్, ఆరోగ్య విస్తరణ అధికారులు పాశం గోవిందరెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రాణి, రాజేశ్వరితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగంపేట్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నాగంపేట్ గ్రామంలో డ్రెయినేజీ పనుల్లో భాగంగా దెబ్బతిన్న సీసీ రోడ్లను పునర్నిర్మించే పనులను గురువారం సర్పంచ్ దాసరి గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పనులు పూర్తయితే.. రహదారి సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మదన్ కుమార్, వార్డు సభ్యులు గంగమణి, ముత్తెన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి 2వ వార్డులో నీటి కష్టాలకు చెక్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 2వ వార్డులో కొన్ని రోజులుగా నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో స్పందించిన కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ పరిష్కారం చూపారు. నిరుపయోగంగా పడి ఉన్న నీటి వనరును యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న స్థానికులు ఈ విషయాన్ని కౌన్సిలర్ దృష్టికి తీసుకురాగా.. ఆమె వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు మంచిర్యాల విద్యాసాగర్, కాంగ్రెస్ క్రిస్టియన్ మైనారిటీ నాయకులు సుజిత్ పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి



**అక్షరటుడే, బోధన్:** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని జిల్లా యువజన క్రీడల అధికారి పవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని టీజీఎంఆర్‌ఎస్ అండ్ జేసీ గర్ల్స్–1లో శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వెల్ఫేర్ వీక్ కార్యక్రమం భాగంగా 'స్ప్లాష్ సమ్మర్ క్యాంప్' ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యం లేకుండా చదివితే గందరగోళానికి గురవుతారన్నారు. ఈ సందర్భంగా టీజీఎంఆర్‌ఎస్ బాల్కొండ విద్యార్థినులు ప్రదర్శించిన పిరమిడ్ ప్రదర్శన అబ్బురపర్చింది. విద్యార్థుల్లో ఉన్న క్రమశిక్షణ, జట్టు ఐకమత్యాన్ని వారు పిరమిడ్ రూపంలో ప్రదర్శించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెల్ఫేర్ వీక్‌లో భాగంగా స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ఇందులో డ్రాయింగ్, క్విజ్, ఉర్దూ, ఇంగ్లిష్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించి విన్నర్స్, రన్నర్స్‌కు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాలలో ఫస్ట్, సెకండ్ ఇయర్‌లో టాపర్లను వారి తల్లిదండ్రులతో కలిసి సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ పద్మజను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సంగీత్ రావు, టీఎంఆర్ఐఈఎస్ నిజామాబాద్ రీజినల్ లెవల్ కో–ఆర్డినేటర్ అబ్దుల్ బషీర్, విజిలెన్స్ అధికారి షేక్ అహ్మద్ జియా, ఎండీ హమీద్ పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీని వైశ్యులు శనివారం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధి శ్రీధర్ గుప్తా ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆర్డీవో ప్రభాకర్, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ వాసంతిలను కలిశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 67 మేరకు ప్రతి ఏడాది వైశాఖ శుక్లపక్ష దశమి రోజు వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు అధికారులు చెప్పారు. శనివారం మధ్యాహ్నం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు.



## జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జొన్నపంట కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ సానుకూలంగా స్పందించి.. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిత వెంకట్రామిరెడ్డి, రామచందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



## బాల్కొండలో జనగణన శిక్షణ తరగతులు ముగింపు

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలో జనగణన -2027 ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన రెండు విడతల శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా ముగిసినట్లు ఛార్జ్ ఆఫీసర్, తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శిక్షణలో భాగంగా ఇళ్ల జాబితా తయారీ, జనాభా లెక్కల సేకరణ విధానాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. తొలిసారిగా పేపర్ రహితంగా మొబైల్ యాప్ ద్వారా జనగణన నిర్వహించనున్న నేపథ్యంలో యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అసిస్టెంట్ ఛార్జ్ ఆఫీసర్ బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ జనగణనలో ఎన్యూమరేటర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్లు నరేందర్, ఐలాపురం రాజు, జూనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

## కోర్టు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి : సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

**అక్షరటుడే, భీమ్‌గల్:** కోర్టు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. పట్టణంలో నూతనంగా మంజూరైన కోర్టు భవన నిర్మాణ పనులను ఆమె శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సివిల్ జడ్జి నిర్మాణ పనుల నాణ్యతను, పురోగతిని తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి చైతన్య, సూర సురేష్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు కె ప్రవీణ్ చందర్, జి సుదర్శన్, పి శంకర్, ఎంకే నాగరాజు, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, ఏఈ విక్రమ్, అంజల్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



## కుక్కర్ పేలి మహిళకు గాయాలు.. కళాశాల వసతి గృహంలో ఘటన

**అక్షరటుడే, కామారెడ్డి:** వంట చేస్తుండగా కుక్కర్ పేలి మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో లావణ్య అనే మహిళ శనివారం విద్యార్థులకు వంట చేస్తోంది. ఈ క్రమంలో కుక్కర్‌లో పప్పు ఉడకబెడుతుండగా ఒక్కసారిగా అది పేలింది. దీంతో వేడివేడి పప్పు లావణ్య ఒంటిపై పడడంతో ఆమె ముఖానికి, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన సిబ్బంది లావణ్యను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం ఆమెకు చికిత్స నిర్వహిస్తున్నారు. బాధితురాలికి ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

## చేంగల్‌లో కార్మేల్ చర్చి వార్షికోత్సవం

**అక్షరటుడే,భీమ్‌గల్:** మండల పరిధిలోని చేంగల్ గ్రామంలో శనివారం కార్మేల్ చర్చి నాలుగో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పాస్టర్లు డేవిడ్ రాజ్, విజయ్ దైవ సందేశాన్ని వినిపించారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, క్రీస్తు బోధనలు అనుసరించడం ద్వారా శాంతి లభిస్తుందని చెప్పారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో సంఘ పెద్దలు దానియేల్, డార్విన్, పలువురు క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు.




## ముప్కాల్‌లో జనగణన శిక్షణ కార్యక్రమం



**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ముంతాజ్‌బోద్దీన్ తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఈనెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు ఉంటుందని తెలిపారు. ఛార్జ్ ఆఫీసర్, తహశీల్దార్, ఎంఈవో ఆధ్వర్యంలో జనగణనకు సంబంధించిన విధానాలు, డేటా సేకరణపై అవగాహన కల్పించనున్నారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ కీలకమన్నారు.